
ఈ వారం కథ



# ఆమె

డా. ఎన్. శైలజ

వెన్ను లోంచి చలి సన్నగా పైకొస్తోంది. వర్టిబ్రేట్స్, ఇన్‌వర్టిబ్రేట్స్ వెన్నముక లేని జీవులు పరిణామక్రమంలో వెన్నుముక గల జీవులుగా మారాయట. పుస్తకంలోంచి తలెత్తి చూసిందామె. డాబా మీద లైటు వంగి మరీ జాలిగా చూస్తున్నట్లుంది. లైటు వెనక పెను చీకటి. ఆకాశంలో చుక్కలు మరీ దూరాన మినుకుమన్న ఆశలా. చదువుతోందే కానీ మనస్సు నిలవడం లేదు. పరిపరివిధాల పోతోంది. పంజరంలో దిక్కుతోచని పిట్టలా. సాయంత్రం గొడవ ఆమెను వెనక్కు తీసుకొనిపోతోంది

రాజ్యలక్ష్మికి ఇరవై రెండేళ్లుంటాయి సన్నగా పొడుగ్గా, చామనఛాయగా చురుగ్గా అందమైన అమ్మాయిల లిస్టులో మొదట పది మందిలోనే వుండేది. యూనివర్శిటీ ఎమ్మెస్సీలో గోల్డ్‌మెడల్. మొదటి ఇంటర్వ్యూతోనే ఉద్యోగం. పిల్ల పెటలై పోయినట్లే 'అనుకున్నారంతా! అది కాస్త మంచి ఉద్యోగమే! పొద్దున్నే ఆఫీసు కారొచ్చేది. ఏవో నాలుగు ఇంగ్లీషు ముక్కలు టకటక లాడించడం, వచ్చేయడం. ఒకరి ఊసు లేదు, కన్నెత్తి చూపూ లేదు. కాలేజీ రోజుల్లో ఆడపిల్లల హాస్టల్ ముందు రోజు మూగ ప్రేమికుడిలా నిల్చొని పలకరించే ధైర్యం లేక రెండేళ్ళు గడిపిన రమేష్ గుర్తుకొచ్చాడు. ఇప్పుడెక్కడో నార్త్‌లో కంపెనీ ఎగ్జిక్యూటివ్‌గా వున్నాడట. అస్సలెవ్వరూ ప్రేమలని, దోమలనీ అనుకోనేలేదు. చదువు, ఉద్యోగం, ఇల్లూ, అమ్మా, నాన్న తప్ప ఇంకేమీ ఆలోచించేది కాదు. అలా కాకపోతే తప్పని మంచివాళ్ళ లిస్టులో వుండనని అనిపించేది. ఉద్యోగంలో చేరాక మాత్రం కొలీగ్ రఘు, ఎప్పుడన్నా కాఫీ కనో, ట్రీట్ ఇస్తాననో అంటే వెళ్ళినా, కళ్ళు కలవకుండా చాలా జాగ్రత్త పడేది. ఎందుకొచ్చిన గొడవ, కులాలు కలవక పోవడం, పెద్దల్తో గొడవ, అనవసరపు



తలనొప్పులన్పించేది.

కానీ, ఆ రోజింకా నిన్నలా, క్రితం నిమిషంలా ఎంతగానో గుర్తుంది. నాన్నగారు వచ్చి పెళ్ళి సంబంధం గురించి చెప్తున్నారు. కుతూహలంగా వున్నా పెద్ద ఇష్టం లేనట్లు అప్పుడే ఇవన్నీ ఎందుకని అనడం, తర్వాత నాన్నగారి స్నేహితునింట్లో 'టీ' కని వెళ్ళి అబ్బాయి కన్పడ్డం జరిగింది. అబ్బాయి బాగానే వున్నాడు. ఒకసారి మాట్లాడితే బావుణ్ణనుకొంది. ఇంతలో అర్థం చేసుకున్నట్లుగా వాళ్ళు మాట్లాడుకోవడానికి అవకాశం కల్పించారు ఎవరి దారిన వారు ఏదో [illegible]మన్నట్టు బయటికి పోయి. ధైర్యంగా అంది రాజ్యలక్ష్మి—

"నేను ఉద్యోగం చెయ్యడం మీకిష్టమేనా" అని.

మీ ఇష్టం అన్నాడతను. కాసేపు హాబీలు, పుస్తకాలు, ఇష్టమైన హీరోల గురించి మాట్లాడుకున్నారు.

నెల రోజుల్లో అన్నవరంలో పెళ్ళి.

ఆమెకా ఆలోచన కొత్తగా వుంది.

ఎప్పుడూ ప్రేమ గురించి, పెళ్ళి గురించి ఆలోచించనే లేదు సరిగ్గా! ఎప్పుడన్నా టీవీలో ఎవరి మీదన్నా పదే పదే ఆలోచన మళ్ళినా! అమ్మో! అమ్మా నాన్న చుట్టుపక్కల వాళ్ళు గుర్తుకొచ్చి ఆలోచన మళ్ళించుకునేది. ఇన్నాళ్ళూ అణచిపెట్టుకున్న మనస్సుకి రెక్కలొచ్చినట్టు అద్భుత లోకాల్లోకి ఎగిరినట్లుగా! వెలుగు రంగుల హరివిల్లు విచ్చుకున్నట్లుగా వుంది. అసలు తన ప్రేమలో అతన్ని ముంచెయ్యాలనుకుంది. భార్యాభర్తల మధ్య తేడాలు దెబ్బలాటలొస్తుంటాయట కానీ తనలా కాదు. అతనే జీవితంగా గడపాలనుకుంది. ఊహ తెల్సినప్పట్నుంచి పెళ్ళి పెళ్ళి అన్న మంత్రం వింటూనే వుంది. అందువల్లనేమో! పెళ్ళి ఒక అద్భుతమైన విషయంలా, అదే Ultimateగా అన్నట్లన్పించేది. పెళ్ళయ్యాక అతని ఊరు వెళ్ళిపోవాలి! తన జాబ్ రాజీనామా చేస్తే పోతుంది. అమ్మో! అమ్మా నాన్న ఏమనుకుంటారో! తనతోనే అంతా అనుకున్నాక ఈ జాబ్ ఎంత? ఆఫీస్‌లో లెటర్ ఇస్తుంటే అందరూ ఆశ్చర్యపోయారు. నవ్వారు. ఆహా! ఎవరీ అతి భయంకర పతివ్రతా శిరోమణి అని. ఆల సీతా, సావిత్రికి అంతగా అచ్చంగా దిగొచ్చిందని. ఏమిటో ఎవరి జీవితాన్ని వారే ఆశల పల్లకీగా మోస్తారంటే వీళ్ళకెందుకని అన్పించింది. ఆ నాలుగు రోజులు కళ్ళకు మబ్బులు తగిలేవి. ఊహలు చుక్కల్లో మల్లెపందిళ్ళ ముగ్గులేసేవి. అంతా ఓ సాగిపోతున్న కలలా గడిచింది. పెళ్ళయింది అన్నవరంలో.

ఆ రాత్రి...

ఇంట్లో అందరూ గుసగుసలు. తనని చూసి ముసి ముసి నవ్వులు! తనకూ చచ్చేంత సిగ్గుగా వుంది. ఇన్నాళ్ళు పెళ్ళి పెళ్ళి అని విన్నా, ఎన్ని సినిమాల్లో చెట్టు వెనక్కి హీరో హీరోయిన్లు వెళ్ళడం చూసినా, ఫారిన్ ఛానల్స్‌లో మరీ దగ్గరగా వున్న సీన్లు చూసినా ఇప్పటికీ ఆ భార్యాభర్తల మధ్య కచ్చితంగా ఏం జరుగుతుందో తెలిస్తే ఒట్టు! ఎవర్నీ అడగలేదు కదా! సర్లే! ఏమీ చదువుకోని illeteratesకి ఇన్ని యుగాలుగా పెళ్ళిళ్ళవుతూనే వున్నాయి. పిల్లలు పుడుతున్నారంటే వాళ్ళకు వాళ్ళే తెల్సుకుంటూనే వున్నారుగా! నేనూ అంతే!

ఆ రాత్రంతా ఆ గదిలో బోల్డు పూలు, పళ్ళ మధ్య అతనితో. కబుర్లు చెప్తున్నారు. అతనామెను దగ్గరగా, చాలా చాలా దగ్గరగా వచ్చి ఆమె గురించి, శరీరం గురించి, తనకెంత ఉద్రేకం కలుగుతుందో చెప్తున్నాడు. ఏదో అద్భుతం జరుగుతుందని చూస్తోంది తను కళ్ళు మూసుకొని. అతను తనతో గడపడం బాగానే వున్నట్లన్పించినా మరీ గొప్పగా ఏమీ లేదేమిటి అన్పించింది. అతను మధ్యలో గబుక్కున లేచి వెళ్ళిపోవడం ఆమెకు అర్థం కాలేదు.

వారం గడిచింది. ఇంట్లో అత్తగారు, ఆడబడుచు బాగానే చూస్తున్నారు. ఆడపడుచు ఏమంటున్నాడు మా అన్నయ్య అని మధ్యలో అడుగుతుంటే నవ్వే సమాధానమయ్యేది.

పదో రోజనుకుంటాను! రాత్రి నిద్రలో మెలకువ వచ్చింది. మంచం మీద అతను కన్పించలేదు. బాత్‌రూమ్‌కని లేచింది. తలుపు తెరిస్తే అతనక్కడ! రాత్రి తను నైటీ వేసుకొని విడిచిపెట్టిన లంగా, బ్రా వేసుకుని, అద్దంలో చూసుకుంటూ! కెవ్వుమనబోయింది. ఆమెను చూసి అతను కెవ్వుమన్నాడు. వెనక్కొచ్చేసింది.

తెలియని గాబరా! ఏమిటిలా! తెలీని అవస్థ. కాస్సేపటికి అతను ఆమె దగ్గరికి వచ్చాడు.

"నువ్వంటే నాకెంతో ఇష్టం. అందుకని అలా వేసుకున్నానన్నాడు. ఆమెను దగ్గరికి తీసుకొన్నాడు. కాస్సేపట్లో వాళ్ళ శరీరాలు దగ్గరయ్యాయి. అతను కాస్సేపు ప్రయత్నించి లేచి వెళ్ళిపోయాడు. ఆమెకేదో తెలీని పరిస్థితి. లావాలా తయారయిన శరీరం మీద నీళ్ళుపోసినంత అసంతృప్తి.

ఎవర్నడగాలి, ఎవరికి చెప్పాలి! అందరు భార్యాభర్తల మధ్య ఇలానే వుంటుందా పెళ్ళయిన కొత్తల్లో!

సమాధానం తెలీదు!

పొద్దున్నకు కాస్త సర్దుకొంది.

తనకి తెలీక కానీ, ఇలానే వుంటుందేమో!

□□□

ఆ రాత్రి..

ఇంట్లో అందరూ గుసగుసలు. తనని చూసి ముసి ముసి నవ్వులు. తనకూ చచ్చేంత సిగ్గుగా వుంది. ఇన్నాళ్ళూ పెళ్ళి పెళ్ళి అని విన్నా, ఎన్ని సినిమాల్లో చెట్టు వెనక్కి హీరోయిన్లు వెళ్ళడం చూసినా, ఫారిన్ ఛానల్స్‌లో మరీ దగ్గరగా వున్న సీన్లు చూసినా ఇప్పటికీ భార్యాభర్తల మధ్య కచ్చితంగా ఏం జరుగుతుంతో తెలిస్తే ఒట్టు

□□□

అనవసరంగా గాభరా పడుతోంది తను.

ఆమెకా విషయం తెల్సాక అతను ఆమె ముందే ఆమె బట్టలు వేసుకుంటానని మొదలెట్టాడు. అతని ప్రవర్తన చిరాకన్పిస్తోంది. అతను వెకిలిగా ప్రవర్తిస్తున్నట్లన్పించిందామెకు. లేదా... అతని ప్రేమను అర్థం చేసుకోలేకపోతోందా! ఏమో....

పదహారు రోజుల పండగ చేస్తామంటూ అమ్మ వచ్చింది. బయల్దేరి వెళ్ళారు వాళ్ళ ఊరు విజయవగరంకి.

ఆ రాత్రి వెన్నల ఒంటరిగా కాస్తోంది.

నాన్నగారు, అతను ఎవరో వాళ్ళ చుట్టాలున్నారంటే పలకరించడానికి వెళ్ళారు. అమ్మ కొత్త అల్లుడి కోసం రకరకాల వంటలు చేస్తోంది.

ఎలా వుందే మీ అత్తారిల్లు! బాగా చూస్తున్నారా! అని ప్రశ్నలు. అన్యమనస్కంగా సమాధానాలు చెప్తోంది రాజ్యలక్ష్మి. అడగాలా వద్దా! ఎవ్వడూ ఇలాంటి విషయాలు అమ్మతో మాట్లాడలేదు. ఎవరో కొత్త మగాడితో తన కూతురు దగ్గరగా మసిలిందంటే అమ్మ ఏమనుకుంటుంది. మన వాళ్ళు రోజూ పెళ్ళి గురించి మాట్లాడతారు: మరి పెళ్ళంటే భర్త చెప్పినట్లుండడం, చెయ్యడం, ఇల్లుచక్కబెట్టుకోవడమేనా! ఇంకేం వుండవా! పోనీ వుండవనే అనుకుందాం! మరి గంపెడు పిల్లల్తో కలకాలం వర్ధిల్లమంటారే! ఇదో అడుగు వెయ్యకూడని నిషిద్ధవర్తులం. ఎంతసేపూ చుట్టూ తిరుగుతాం. విషయంలోకి వెళ్ళం.

అబ్బాయి నీతో ఎలా వుంటున్నాడు!

ఆ! అంది.

పని అయిపోయాక అమ్మ వచ్చి కూర్చుంది.

మంచంమీద ఆలోచనల్తో మునిగిన రాజ్యలక్ష్మి లేచి కూర్చుంది. మాటల్లో ఆడపడుచు తనని తరచి తరచి అడగడం గురించి చెప్పింది. అదేమిటే ఆవిడ కెందుకు అంత ఆరా! అంది అనుమానంగా. ఒక్కో విషయం అడుగుతుంటే నెమ్మదిగా చెప్తోంది సగం మింగి, సగం నానుస్తూ! ఆఖరికి అతని ప్రవర్తన కూడా!

ఆమె నిజంగానా! అని విస్తుపోయింది. తన అజ్ఞానమో, విజ్ఞానమో తెలీదు కానీ కాస్త తేడాగా వుందని గుర్తించింది వాళ్ళమ్మ బెంగగా మాట్లాడుతుంటే! లోపల్నుంచి దడ వుట్టుకొస్తోంది. ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు. కొబ్బరిచెట్లు తలొంచుకుని నిల్చున్నట్లున్నాయి మౌనం పాటిస్తూ. ఆకుల మీద పడి వెన్నెల కరుగుతున్న కలలా జారుతోంది. ఆమె ఒంటికి కన్నీటి చార తాకుతోంది చల్లగా. ఆమెకు అన్పిస్తోంది! అస్సలేమీ లేదు! మొదట్లో సర్దుకోక రెండు కొత్త ప్రపంచాల నుంచి వచ్చిన వాళ్ళ మధ్య cultural shock అనిపిస్తోంది. సర్దుకుపోతుందిలే అన్పిస్తోంది.

రాజ్యలక్ష్మి వాళ్ళమ్మ కాస్త పరిశీలనగా తననూ, తన భర్త మధ్య జరిగే విషయాల్ని చూస్తుంటే ఇబ్బంది పడ్తోంది. రెండో రోజు సాయంత్రం తనకు తెల్సిన వాళ్ళింటికి వెళ్దాం రావే అని బయల్దేరదీసింది. ఆవిడ రాధాదేవి అని అమ్మకు చిన్నప్పట్నుంచీ తెల్సిన లేడీ డాక్టరు. పెద్దావిడ చిన్నప్పట్నుంచి చిన్నా చితకా జ్వరాలకు ఆమె దగ్గరకు తీసుకొని వెళ్లేది. తనకూ పరిచయం బాగా! ఆంటీ అంటుంటుంది. ఆవిడ ఏమ్మా బావున్నావా! పెళ్ళయ్యాక ఇదేనా రావడం అంది. అవునని తలూపింది. అక్కడ వాతావరణం ఇబ్బందిగా వుంది. తన చుట్టూ గోడ కట్టేసుకుని ఎవరికీ కన్పించకుండా వుంటే బావుణ్ణని వుంది. ఈ ప్రశ్నలు సమాధానాలూ, కొత్త నిజాలు వినే ఓపిక లేదన్పించింది. ఏమిటో సిన్మాల్లోలా పెళ్ళవ్వగానే ఆల్ ఎండ్స్ వెల్‌లా వుంటుందనుకున్న జీవితం, అనుకోనంత జటిలంగా వుందెందుకో అర్థం కావడం లేదు.

వాళ్ళమ్మ ఆ మాటల మధ్య ఎప్పుడు బయటికి వెళ్ళిందో తెలీదు. ఆంటీలోని ప్రేమ ఆదరణ నేనున్నానులే అన్పించే భావం, అమ్మ కూడా లేదుగా! కాస్త ధైర్యం కూడదీసుకుని మొత్తం చెప్పింది. అయ్యాక ఏం చెయ్యాలో తెలీని భావం. ఖాళీ అయిపోయినట్లు ఫీలింగ్ ఆమెను ఆవరించాయి. డాక్టరాంటి రాజ్యలక్ష్మి దగ్గరకొచ్చి భుజం మీద చెయ్యేసింది. అది నీటివాలులో కొట్టుకుపోతున్న చీమకు ఆధారంగా దొరికిన ఆకులా వుంది.

చలిలో పొద్దున్నే దుప్పటి లోంచ ప్రసరించిన సూర్యకిరణంలా వుంది.

కుర్చీ పక్కకు లాక్కుని కూర్చుని ఆవిడ అడుగుతోంది.

భర్తతో తను ఎలా వుందో, ఎంత దగ్గరగా వుందో! మరీ ఇబ్బందికరమైనవి కూడా. నెమ్మదిగా సమాధానమిచ్చిందామె!

జీవితంలో కొన్ని విషయాలు మన ప్రమేయం లేకుండానే దెబ్బకొడ్తాయి. అప్పుడే మనం ధైర్యంగా వుండి ఆలోచించుకోవాలి అంటుంటే–

ఒక finality అనుకోనిదేదో, సంశయించిందేదో వినాలన్న విషయం అర్థమయ్యిందామెకు! ఎక్కడకన్నా ఎవ్వరూ లేని దూరాలకు పారిపోవాలని! పాత కలల్ని పోగు చేసుకోవాలన్పించింది. అది భయంకర సమస్య కాకుండా కాస్త ఓపిక పడితే సర్దుకొనేదైతే బావుణ్ణు! అన్న ఆలోచనలు ఒక్క తృటిలో ముంచేస్తున్నాయి.

ఆ అబ్బాయి... ఆడపిల్లతో సంసారం చేసే శక్తి లేదమ్మా! అతనికున్నది 'ట్రాన్స్‌వెస్టిజం' మానసిక వ్యాధి. అయితే ఆ వ్యాధి అయితే వున్నవాళ్ళు కొందరు మామూలుగా భార్యతో కాపురం చెయ్యగలుగుతారు. నువ్వు చెప్పిన దానిని బట్టి ఇప్పటివరకు మీ ఇద్దరి మధ్య ఏమీ జరగలేదని తెలుస్తోంది. అతని కబుర్లు సినిమాల్లో డైలాగుల్లాంటివి. తన స్థితిని కప్పిపుచ్చుకోడానికి చేసినవని తెలుస్తోంది అంది డాక్టరు ఆంటీ.

ఒక నిజం తను వినాలనుకోనిది వినేసింది. ఒక్కసారిగా జీవితం తనన్ను చాచి లెంపకాయ కొట్టినట్లు! ప్రపంచంమంతా కలిసి కుట్ర పన్ని తన్ను మోసం చేసినట్టు నిస్పృహాయత ఆమెను ఆవహించింది. దుఃఖం తన్నుకుని పైకొస్తోంది! ఒక ఉక్రోషం! తనకు మాత్రమే ఎందుకిలా జరగాలి! తన స్నేహితురాళ్ళు సుధ, రాణి, పక్కింటమ్మాయి గుర్తుకొచ్చారు. ఎన్ని వేల మంది పెళ్ళిళ్ళు కావడం లేదు! వెక్కి వెక్కి ఏడుస్తోంది రాజ్యలక్ష్మి. ఏమనలేని ఆంటీ ఆమె వీపుని నిమురుతూ వుండిపోయింది. కాలానికి ఫుల్‌స్టాప్ పెట్టినట్టు, తల దిమ్ముగా ఏమీ ఆలోచించలేని స్థితి. అమ్మ తిరిగొచ్చింది! విషయం అర్థమయింది! ఆమె ఏడుస్తోంది! ఈ అన్యాయానికి

❑❑❑

ఒక నిజం తను వినాలనుకోనిది వినేసింది. ఒక్కసారిగా జీవితం తన్ను చాచి లెంపకాయ కొట్టినట్లు! ప్రపంచమంతా కలిసి కుట్ర పన్ని తన్ను మోసం చేసినట్టు నిస్సహాయత ఆమెను ఆవహించింది. దుఃఖం పైకి తన్నుకొని పైకి వస్తుంది.

❑❑❑

కారకులెవరని ప్రశ్నించుకొంటోంది.

***

ఆ రాత్రి ఇంట్లో పెద్ద గొడవే అయింది. అతను కాస్సేపు నిర్ఘాంతపోయాడు. నువ్వు అబద్ధాలాడుతున్నావు! తన కెలాంటి లోపం లేదు నార్మల్ అన్నాడు! నువ్వెవడ్నో ప్రేమించి ఇప్పుడు నన్నొదిలించుకోడానికలా అంటున్నావన్నాడు. తర్వాత.... ఆమెను బతిమాలాడు. ఎవరికీ చెప్పొద్దు అన్నాడు. అంతగా కావాలంటే నీ కిష్టమైన ఎవరితోనన్నా వుండువుకానీ, బజార్న వెయ్యకు ఇంటి పరువన్నాడు. ఆమె చూస్తోంది. అతని లోని మార్పుల్ని. అతన ఆధిపత్యం కోసం చేసే ప్రయత్నం. ఎందుకిలా జరిగిందో అర్థం కావడం లేదు. రెండు పదులు పెద్ద నిండనన్నా లేదు జీవితం పూర్తిగా చేయి జారిపోయిందా! ఎదురుగా భవిష్యత్తు భయంకరంగా కన్పిస్తోంది. రేపు విడాకులంటే అందరూ ఒకరకంగా తనను చూసే చూపు, తను చెయ్యని తప్పుకు అందరి దగ్గరా తక్కువగా చూడబడుతుంది, హేళన చెయ్యబడుతుంది. తను ఎక్కడ తేలుతానో తెలీని స్థితి! పోనీ! గొడవ లేకుండా అలా సర్దేసుకోనా! ఏముంది ఎందరో పిల్లలు లేని వాళ్ళలో తనూ ఒకత్తవుతుంది. గొడ్రాలంటారు! ఒక మగవాడితో కలిసినండడం అన్నది తనెప్పుడూ లోతుగా ఆలోచించలేదు కదా! పోనీ ఇలా కంటిన్యూ అయిపోతే! కానీ తన లోపం పూర్తిగా తెలిసి కూడా పెళ్ళి చేసుకుని ఒక ఆడపిల్ల పూర్తి జీవితాన్ని నాశనం చేసాడే! ఆమెకు కోపం వస్తోంది. గట్టిగా అరవాలనుంది. తన్ని పెంచిన తల్లిదండ్రుల మీద, సమాజం మీద, అత్తమామల మీద, భర్త మీద. ఛీ వెధవ జీవితం అనుకుంది.

అందర్నీ తన్నాలన్నంత కోపం తన్ను కొస్తోంది. మానసికంగా ఇంత బలహీనంగా వున్నందుకు తన మీదే కోపం వస్తుంది. ఇక చేసేదేముంది. కొత్తగా పోయేదేముందో అర్థం కావడం లేదు. ఒక depression ఆమెను ఆవహిస్తోంది. అతను వాళ్ళ ఊరు వెళ్ళిపోయాడు.

***

వెళ్ళే ముందు విడాకులు తీసుకుందామంది. అతను ఆలోచించమన్నాడు. ఎందరో ఇలాంటి ప్రాబ్లమ్స్‌తో వున్నారు, సర్దుకోవడం లేదా అన్నాడు. మా అమ్మ నాన్నలు వచ్చి మాట్లాడతారని చెప్పి వెళ్ళిపోయాడు.

వారం తర్వాత రాజ్యలక్ష్మి అత్త, మామ వచ్చారు.

ఎన్నో వాదనలు, ప్రతివాదనల మధ్య ఆమె ఇద్దరికీ విడాకులిష్టమేనని పెడితే ఆర్నెల్లల్లో వచ్చేస్తాయి అన్నారు. అవును అప్పుడు అతని లోపం బయటికి రాదు. లాభం లేదని తన స్నేహితురాలు రాణి దగ్గరకి బయల్దేరింది సలహా కోసం.

రాణి చిన్నప్పట్నించీ కాస్త తెలివిగా, చలాకీగా వుండేది. ఇప్పుడు లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తోందేమో ఇంకా పదునుగా తయారయ్యింది. తను సమస్యను పూర్తిగా చెప్పింది. నిజమే! తనతో మాట్లాడాక కానీ ఎదుటి సమస్యల చిక్కు విడలేదు. విడాకులకి ఇద్దరూ ఇష్టపడి సంతకం పెడితే తొందరగా అతనికి ఏ నామోషీ లేకుండా వచ్చేస్తాయి. రేపు ఎవరడిగినా ఎందుకు విడాకులంటే చదువుకొంది, గర్వం అంటారు. లేదు కారెక్టర్ మంచిది కాదంటారు. తను అందరి ముందు దోషిలా నిలబడాలి. ఎవడికన్పించిన కారణం వాడు నా మీద రుద్దుతారు. ఆమెకు చాలా కష్టంగా, బాధగా వుంది. అయినా ఒక నిర్ణయానికి రాక తప్పదు. జీవితం అంటే పెళ్ళి, భర్త అనుకుంది. నిజంగా బోల్డు ఇంపార్టెన్స్ ఇచ్చి ఉద్యోగం కూడా వదిలొచ్చి ఇలా తెగిన గాలిపటంలా తయారైంది. తనకంటూ ఓ జీవితం వుందన్న ఆలోచన. ఇక అడ్డంకులను ఎదుర్కొనక తప్పదుగా.

ఇక ఎలాగూ ఎదురు పోరాటమే అడుగేస్తే అడుగుతీస్తే. విడాకులకు అప్లై చెయ్యడానికి నిర్ణయించుకుంది. అమ్మా, నాన్న, పెద్దలూ ఎందుకీ రాద్ధాంతం. ఏదో కామ్‌గా వదిలించుకుంటే పోతుందిగా అంటున్నారు.

విడాకుల్ని రద్దుపర్చమని, వాళ్ళిద్దరూ భార్యాభర్తలుగా సంసారం చెయ్యలేదని, అతనికి లోపం వుందని కచ్చితంగానే నిరూపించదల్చుకుంది.

పెళ్ళి ముందు అప్లై చేసిన ఉద్యోగానికి పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఇప్పుడు ఇక రాయాలి. ఆమె పుస్తకాలు తీసుకుని డాబా మీద కెళ్ళింది. ●

